సాక్షి
జగిత్యాల
గురువారం | 1 | జూన్ | 2023


కల్యాణ వేడుకల్లో స్వామివార్ల ఉత్సవమూర్తులు


కల్యాణ వేడుకను చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

న్యూస్‌రీల్

పొగాకు వాడొద్దు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

జగిత్యాల: పొగాకు అలవాటు ఉన్నవారు మానుకోవాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మోతెవాడ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పొగాకు వాడేవారితో పాటు, సమీపంలోని వారు, కుటుంబ సభ్యులు వ్యాధులకు గురవుతారన్నారు. పొగాకు వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు సమర్థవంతమైన విధానాలు రూపొందించి అమలుకు నిర్ణయాలు తీసుకున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు ఎ.శ్రీనివాస్, సమి యొద్దీన్, ఎన్.శ్రీనివాస్, డాక్టర్ స్వాతి, లక్ష్మణ్, రవిశంకర్, స్వామి, మురళీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి


ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

మల్లాపూర్(కోరుట్ల): ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరాలని మెట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బుర్ర చంద్రశేఖర్ కోరారు. ఇంటర్ పూర్తయిన చిట్టాపూర్‌లోని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లిన అధ్యాపకులు.. ఇంటింటా ప్రచారం చేశారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ప్రైవేటు కళాశాలలకు దీటుగా 90శాతం ఫలితాలను సాధించిన ఏకైక కళాశాలగా మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచిందని అన్నారు. 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్థశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకయ్య, అధ్యాపకులు తూము మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రివాల్వర్ కలకలం

కోరుట్ల: అయిలాపూర్‌లో బుధవారం రాత్రి పోలీసులు రివాల్వర్ స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. గ్రామానికి చెందిన సుందరగిరి లక్ష్మయ్య గతంలో దుబాయ్, ముంబాయి వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో అప్పులు కావడంతో ఈ బాధనుంచి గట్టెక్కడానికి బెదిరింపులు, సెటిల్‌మెంట్లు చేయాలని నిర్ణయించాడు. దీంతో ముంబాయిలో అప్పటికేఉన్న పరిచయాలను ఉపయోగించుకుని మూడు నెలల క్రితం రూ.లక్ష వెచ్చించి రివాల్వర్ ఖరీదు చేశాడు. దీనితో బెదిరింపులకు దిగాడా? లేదా? అనే సమాచారం కోసం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది. నిందితుడు సుందరగిరి లక్ష్మయ్య ముంబాయి నుంచి రివాల్వర్ తెప్పించుకోవడంలో ఎవరెవరు సహకరించారన్న విషయమై పోలీసులు కూపీ లాగుతున్నారు. మొత్తం మీద రివాల్వర్ పోలీసులు రివాల్వర్ స్వాధీనం చేసుకున్న అంశం స్థానికంగా కలకలం రేపింది. రివాల్వర్‌తో పాటు రెండు మ్యాగజైన్లు, మూడు బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



గోవిందా.. హరి గోవిందా వేంకటరమణ గోవిందా..

అన్నమాచార్య కీర్తనలు.. ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. విశేష అలంకరణలు.. వేదపండితుల వేదమంత్రోచ్చారణలు.. వెల్లువిరిసిన భక్తి పారవశ్యం మధ్య బుధవారం సాయంత్రం కరీంనగర్ పద్మనగర్‌లో శ్రీనివాసుడి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తంతులో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో వేద పండితులు మంత్రోచ్చారణలమధ్య శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ వైభవంగా జరిగింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – కరీంనగర్‌కల్చరల్


భూమిపూజ అనంతరం హారతి అందుకుంటున్న ప్రముఖులు


స్వామివార్ల పట్టువస్త్రాలు చూపుతున్న అర్చకుడు




తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు


ఆశీర్వాదం తీసుకుంటున్న ఎంపీ బండి సంజయ్


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కమలాకర్, వినోద్‌కుమార్


శోభాయాత్రలో ఆకట్టుకున్న అంబారీలు, అశ్వాలు

ప్రగతి పరుగులకు ఆటంకం

- మాస్టర్‌ప్లాన్ జీవో రద్దు పర్యవసానం



జగిత్యాల: జగిత్యాల మాస్టర్‌ప్లాన్ జీవో నంబరు 238ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. పట్టణ ప్రణాళికపై వివిధ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. బల్దియా అభివృద్ధి కోసం ముసాయిదా రూపొందించిన అధికారులు.. ప్రభుత్వానికి నివేదించారు. దీంతో జీవో నంబరు 238 ద్వారా 15 డిసెంబర్ 2022న మాస్టర్ ప్లాన్ అమలుకు ఉత్తర్వులు జారీచేసింది. ఫిబ్రవరి 28 వరకు అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చింది. ముసాయిదాలో పట్టణ పరిసరాల్లోని ధరూర్, మోతె, నర్సింగాపూర్, తిమ్మాపూర్, అంబారిపేట, లింగంపేట, తిప్పన్నపేట గ్రామలను విలీనం చేశారు. విలువైన భూములు చేర్చారని రైతులు ఆందోళనలకు దిగారు. ఇది ముసాయిదానేనని అధికారులు, పాలకులు చెప్పినా వివిధ వర్గాలు వినకుండా ప్రత్యక్ష ఆందోళనలకు దిగాయి.

రూపకల్పనపై నిర్లక్ష్యం

- సర్కారు మార్గదర్శకాల ప్రకారం పదేళ్లకోసారి మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సి ఉంది.
- కానీ, అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యంతో 1989లో ఉన్న మాస్టర్‌ప్లాన్‌నే కొనసాగిస్తూ వస్తున్నారు.
- దీంతో రోడ్లు, ఇళ్ల లేఅవుట్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి.
- 2016కు ముందు ఒకసారి మాస్టర్‌ప్లాన్ అమలుకు యత్నించారు.
- 2016లో జగిత్యాల జిల్లాగా ఆవిర్భవించాక సమీప గ్రామాలను విలీనం చేయడంతో పరిస్థితి పునరావృతమైంది.
- అయితే, గతేడాది జనవరిలో మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.
- ఇది కొలిక్కి వచ్చిందని భావించినా.. విలువైన భూములు, సుదూరంలోని గ్రామాలను విలీనం చేయడంతో తాము నష్టపోతామని వివిధ వర్గాలు ఆందోళనలకు దిగాయి.
- ప్రతిపక్ష పార్టీలకు ఇవి మంచిఆయుధాలుగా మారాయి.

అభివృద్ధికి ఆటంకమే..

జగిత్యాల పట్టణ విస్తీర్ణం ప్రస్తుతం 6 చ.కి.మీ వరకు విస్తరించింది. పలు గ్రామాలు విలీనమయ్యాయి. కొత్తమాస్టర్‌ప్లాన్ అమలు చేస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. అయితే, అధికారులు, ప్రజాప్రతినిధులు ముసాయిదాలో సమీప గ్రామాలు, భూములు విలీనం చేసేందుకు బాధ్యులతో చర్చించాల్సి ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విలువైన భూములు వదిలేసి.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశ్రామిక జోన్లు ఏర్పాటు చేస్తే సమస్యలు తలెత్తేవి కావని అంటున్నారు.

లేఅవుట్లు లేక పరేషాన్..

- ప్రస్తుతం టీఎస్‌బీపాస్ ద్వారా ఇంటి నిర్మాణ అనుమతులు జారీ అవుతున్నాయి.
- అంతకు ముందు ప్రణాళిక లేకుండా ఇళ్లు కట్టుకున్నారు.
- దీంతో వీధుల్లో ఆటోలు, కార్లు రాకపోకలు సాగించే వీలులేకుండా పోయింది.
- కొత్త మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తే పట్టణ రూపురేఖలు మారి ప్రగతి పథంలో నడుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రద్దును స్వాగతిస్తున్నాం

జగిత్యాలటౌన్: ప్రజావ్యతిరేకతను గుర్తించి మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో కర్మ, కర్త, క్రియ అన్నీతానైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్.. తన లోపాలకు అధికారులను బాధ్యులను చేయాలనుకోవడం శోచనీయమన్నారు.

విస్తరించిన జిల్లా కేంద్రం..

జగిత్యాల జనాభా 1850లో సుమారు రెండు వేలు ఉంది. దాదాపు 500 నివాసాలు ఉండేవి. ఆ తర్వాత మున్సిపాలిటీగా గుర్తించాక 1985లో ద్వితీయ శ్రేణి హోదా లభించింది. 2009లో గ్రేడ్–1 మున్సిపాలిటీగా అభివద్ధి చెందింది. ప్రస్తుత జనాభా సుమారు లక్ష వరకు చేరింది. సుమారు 35వేలకుపైగా నివాసాలు ఏర్పడ్డాయి. దాదాపు 10కి.మీ. విస్తీర్ణానికి విస్తరించింది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో కొత్త మాస్టర్‌ప్లాన్ అటకెక్కినట్లే అని భావిస్తున్నారు.

బోగస్ ఓట్ల ఏరివేతకు సర్వే

- నెలరోజులపాటు కొత్త ఓటర్ల నమోదు
- జిల్లా ఓటర్ల సంఖ్య 7,84,105
- అక్టోబర్ 4న తుదిజాబితా


ఓటరు జాబితా సర్వే పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో బోగస్ ఓటర్ల ఏరివేతకు బీఎల్వోలతో ఇంటింటా సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు ఆ ప్రక్రియ ప్రారంభించారు. మరోవైపు.. ఈఏడాది అక్టోబర్ ఒకటో తేదీనాటికి 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు, వచ్చేఏడాది పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో రాజకీయ నాయకులు కూడా కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించారు.

జిల్లా ఓటర్లు 7,84,105 మంది..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా.. 380 గ్రామాలు, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.
- జిల్లా పరిధిలో పూర్తిగా కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలు ఉన్నాయి.
- వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్, మేడిపెల్లి, బీమారం, చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాలు మాత్రమే జిల్లా పరిధిలో ఉన్నాయి.
- జిల్లాలో మొత్తం ఓటర్లు 7,84,105 మంది ఉన్నారు.
- ఇందులో పురుషులు 3,79,749 మంది కాగా, మహిళలు 4,04,340 మంది ఉన్నారు.

షెడ్యూల్ ఇదే..

జూన్ 23వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటా పర్యటించి ఓటరు జాబితా పరిశీలిస్తారు. మృతిచెందిన, వలస వెళ్లినవారి పేర్లను జాబితాలోంచి తొలగిస్తారు. జూన్ 24 నుంచి జూలై 27వ తేదీ వరకు పోలింగ్ బూత్‌ల వారీగా ప్రతీబూత్‌లో 1,500 మంది ఓటర్లు మించకుండా క్రమబద్ధీకరిస్తారు. జూలై 25 నుంచి 31వ తేదీ వరకు ఓటరు జాబితాకు సంబంధించిన పురుషుల, మహిళ ఓటర్ల వివరాలను క్రోడీకరిస్తారు. ఆగస్టు 2న ఓటరు జాబితా ప్రకటిస్తారు. దీనిపై ఆగస్టు 31 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలను సెప్టెంబర్ 22లోగా పరిష్కరించి కొత్త ఓటరు జాబితాను ముద్రించి అక్టోబర్ 4న ప్రకటిస్తారు.

బోగస్ ఓటర్ల ఏరివేతకు సర్వే..

బోగస్ ఓటర్ల ఏరివేతకు బీఎల్వోలతో ఇంటింటా సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లాలో ఈ ప్రక్రియ చురుకుగా కొనసాగుతుంది. ఓటర్ల జాబితాను రాజకీయా పార్టీల నాయకులకు అందించి వారినుంచి అభ్యంతరాలు స్వీకరించాలని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



బోగస్ ఓటర్ల ఏరివేతకు బీఎల్వోలు ఇంటింటా సర్వే చేస్తున్నారు. అక్టోబర్ ఒకటో తేదీనాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్రతీబూత్‌లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారు. ప్రతీబూత్‌లో ఓటరు జాబితా అందుబాటులో ఉంటుంది. బీఎల్వోలు గరుడ యాప్‌లో కొత్తగా ఓటుహక్కు దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేస్తారు. మీ సేవా కేంద్రాలతోపాటు ఆన్‌లైన్‌లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వీలుంది.
– శ్రీనివాస్, తహసీల్దార్, కథలాపూర్

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
జగిత్యాల	1,01,672	1,08,082	2,09,767
కోరుట్ల	1,06,305	1,15,457	2,09767
ధర్మపురి	1,02,799	1,05,917	2,08,718
చొప్పదండి (మల్యాల, కొడిమ్యాల)	34,954	37,261	72,215
వేములవాడ (కథలాపూర్, మేడిపెల్లి)	34,019	37,623	71,643

ఉద్యోగి మోసమే ప్రాణం తీసింది

- మనస్తాపంతోనే హీరో షోరూం యజమాని ఆత్మహత్య
- కన్నీటిపర్యంతమవుతున్న కుటుంబసభ్యులు, బంధువులు
- మెట్‌పల్లి, కథలాపూర్ మండలాల్లో విషాదం
- ఆందోళనలో స్కీం సభ్యులు


రోదిస్తున్న నరేశ్ కుటుంబసభ్యులు, బంధువులు


నరేశ్(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): నమ్మకంగా పనిచేసిన ఉద్యోగిని భాగస్వామిగా చేసుకుని లాటరీ స్కీం ప్రారంభించిన హీరో షోరూం యజమాని సబ్బని నరేశ్(40).. ఆ ఉద్యోగి రూ.1.90 కోట్లు స్వాహా చేయడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. కష్టమర్ల ఎదుట తన పరువు పోయిందనే బాధతో ఆత్మహత్య చేసుకోవడం మెట్‌పల్లి, కథలాపూర్ మండలాల్లో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన సబ్బని నరేశ్ కథలాపూర్‌లో ఏడేళ్లక్రితం రాజరాజేశ్వరి మోటార్స్ పేరిట హీరో బైక్ షోరూం ప్రారంభించారు. అప్పట్లో బైక్ విక్రయాలు జోరుగా సాగేవి. వినియోగదారులు అధికంగా ఫైనాన్స్, నెలవారీ చెల్లింపులపై ఆధారపడేవారు. దీంతో నాలుగేళ్ల క్రితం లాటరీ స్కీం ప్రారంభించినట్లు తెలిసింది. ఇందులో సభ్యులను చేర్చుకుని, ప్రతినెలా రూ.2,600 చెల్లించేలా స్కీం నడిపినట్లు తెలిసింది. ఒక్కో గ్రూపులో 200 మంది సభ్యులు ఉండేవారు. ప్రతీనెల 10వ తేదీన సభ్యుల సమక్షంలో డ్రాతీసి అందులో పేరు వచ్చినవారికి హీరో కంపెనీ బైక్ ఇచ్చేవారు. ఇలా కొంతకాలం రెండు గ్రూపులు సజావుగా సాగాయి.

ఉద్యోగితో కలిసి నాలుగు గ్రూపులు ప్రారంభం

మెట్‌పల్లికి చెందిన గోనే ప్రతాప్ ఆరేళ్లుగా షోరూంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. యజమాని నరేశ్‌కు నమ్మినవ్యక్తిగా ఉండేవాడు. రెండు లాటరీ గ్రూపులు విజయవంతం కావడంతో రెండున్నరేళ్ల క్రితం మరో నాలుగు గ్రూపులతో బైక్ లాటరీ స్కీం ప్రారంభించారు. ఇందులో ప్రతాప్‌ను పార్ట్‌నర్‌గా చేసుకున్నాడు. కొత్తగా ప్రారంభించిన నాలుగు గ్రూపుల లావాదేవీలు ప్రతాప్ నిర్వహించేవాడు.

350 మందికి బైక్‌లు ఇచ్చి.. రూ.1.60కోట్లు స్వాహా చేసి..

350మంది సభ్యులకు ముందస్తుగా, డ్రా పద్ధతిన బైక్‌లు ఇచ్చిన ప్రతాప్.. అందుకు సంబంధించిన సొమ్ము రూ.1.60కోట్లను యజమాని నరేశ్‌కు ఇచ్చాడు. మిగతా రూ.1.90కోట్లు తర్వాత ఇస్తానని చెప్పి స్వాహా చేశాడు. ఈ విషయం నరేశ్ తీసిన సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. ఈ సొమ్ము కాకుండా స్కీం సభ్యులు చెల్లించిన డబ్బులు కూడా ప్రతాప్ స్వాహా చేశాడు. ఈ విషయంలో పలుసార్లు పంచాయితీలు జరిగాయి. లెక్కలు చెబుతానంటూ ప్రతాప్ దాటవేస్తూ వచ్చాడు. దీంతో నరేశ్ మానసికంగా కుంగిపోయాడు. 15 రోజులుగా ఆచూకీ లేకుండాపోయారు. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. తన మృతితోనైనా తనకు రావాల్సిన సొమ్మును తన కుటుంబ సభ్యులు ఇవ్వాలంటూ నరేశ్ తీసిన సెల్ఫీ వీడియో చూసిన కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



అక్రమంగా లాటరీ, స్కీంలు నిర్వహించి ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇవి నిబంధనలకు విరుద్ధం. ఇలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

డబ్బులు చెల్లించిన



నెలకు రూ.2,600 చెల్లిస్తే లాటరీ తీసి బైక్ ఇస్తమన్నరు. రెండున్నరేళ్ల క్రితం స్కీంలో చేరిన. అప్పట్నుంచి 27నెలలు గోనే ప్రతాప్‌కు ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించిన. ఇంకో మూడు కిస్తీలు చెల్లిస్తే గడువు ముగుస్తుందనుకున్న. 15 రోజుల క్రితం షోరూం యజమాని అదృశ్యమైనట్లు తెలిసింది. ప్రతాప్ ఎక్కడ ఉంటారో తెలియదు. మోసపోయామని తెలిసి వారం క్రితం పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చినం. మా డబ్బులు మాకు ఇప్పించాలి.
– మ్యాదరి విక్రమ్, సభ్యుడు, కథలాపూర్

బైక్ ఇవ్వలే



హీరో షోరూం నిర్వాహకులు ప్రవేశ పెట్టిన నెలకు రూ.2,600 చెల్లించి లాటరీ స్కీంలో చేరిన. ప్రతినెలా క్రమం తప్పకుండా డబ్బులు కట్టిన. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 30 నెలలు పూర్తయింది. పైసలు ముట్టినయి గదా.. ఇగ బైక్ చేతికి వస్తదని అనుకున్న. కానీ, షోరూం వాళ్లు నాకు బైక్ ఇవ్వలేదు. కనీసం నేను చెల్లించిన డబ్బులు ఇవ్వాలని అడిగితే రూ.75 వేలు ఇస్తామని చెప్పి తిప్పించుకున్నరు. బైక్ ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వలేదు. న్యాయం చేయండి.
– గోపిడి నారాయణ, స్కీం సభ్యుడు, భూషణరావుపేట

ఘనంగా బీరయ్య పట్నాలు



పెగడపల్లి(ధర్మపురి): కీచులాటపల్లి గ్రామంలో బీరయ్య పట్నాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం దీపాలంకరణ, అమ్మవారికి బోనాల సమర్పణ ఘనంగా నిర్వహించారు. ఎల్ఎం ట్రస్టు చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత. జెడ్పీటీసీ రాజేందర్‌రావు పూజలు చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ నిర్మల, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ రవి, బీఆర్ఎస్ నాయకులు ఐరుగురాల ఆనందం, రాచకొండ ఆనందం, అజయ్, గొల్ల, కుర్మ యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణం



మెట్‌పల్లి(కోరుట్ల): వెల్లుల్ల రోడ్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నుంచి ప్రతీరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు కల్యాణం జరిపించారు. ఉత్సవ విగ్రహాలను అలంకరించి వేదమంత్రోచ్చారణల మధ్య తంతు నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు, భక్తులు కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న బండి సంజయ్

కోరుట్ల : పట్టణంలోని సాయిబాబా ఆలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బుధవారం పూజలు చేశారు. కరీంనగర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న బండి సంజయ్‌కు కార్యకర్తలు, నాయకులు కోరుట్ల శివారులో ఘన స్వాగతం పలికారు. అనంతరం సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. నియోజకవర్గ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు, నాయకులు సురభి నవీన్ కుమార్, జేయస్ సునీత, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని సిరికొండలో అట్రాసిటీ కేసుపై మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మహేశ్, సూర్యనారాయణ, హరీశ్ కులంపేరుతో దూషించారని బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం గ్రామంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. గల్ఫ్‌లో మోసపోయిన కథలాపూర్ మండలం అంబారిపేట, కలిగోట గ్రామాలకు చెందిన గిరిజనులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై శ్వేత ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో శిశువు మృతి

కోరుట్ల: ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతిచెందగా వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందిందని బంధువులు ఆందోళన చేశారు. పట్టణంలోని భీమునిదుబ్బకు చెందిన జాల మౌనిక (22) డెలివరీ కోసం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ప్రసవం తర్వాత అప్పుడే పుట్టిన నవజాత శిశువుకు గుండె సమస్య ఉందని వైద్యులు జగిత్యాల ఆస్పత్రికి రెఫర్ చేశారు. శిశువు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతిచెందిందని మౌనిక బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. నార్మల్ డెలివరీ చేస్తామని చెప్పి ఆలస్యం చేయడంతో శిశువు మృతి చెందిందని వైద్యులకు ఎంత చెప్పినా పట్టించుకోలేదన్నారు. కోరుట్ల ఆసుపత్రిలో ఒకే గైనకాలజిస్టు ఉందని ఆరోపించారు. నర్సులు ప్రసవం చేయడంతోనే శిశువు చనిపోయినట్లు తెలిపారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీతను వివరణ కోరగా శిశువుకు గుండె సమస్య ఉండటంతో జగిత్యాలకు పంపామని అక్కడ శిశువు మృతిచెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్..

కథలాపూర్ (వేములవాడ): మేడిపెల్లి మండల కేంద్రం శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ బియ్యాల కుమార్ (35) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి చెందిన బియ్యాల కుమార్ లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ మేడిపెల్లి శివారులో చెట్టును ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ సందీప్, క్లీనర్ కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సందీప్‌ను బయటకు తీసి చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. లారీ క్లీనర్ కుమార్‌ను బుధవారం గుర్తించి క్యాబిన్‌లో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

కోడిగుడ్లపై అంగన్‌వాడీ లోగో

- జిల్లాలో 1,065 కేంద్రాలు
- పక్కదారి పట్టకుండా ప్రభుత్వ లోగోతో సరఫరా
- ఇతరులకు విక్రయిస్తే సులభంగా గుర్తింపు



అంగన్‌వాడీ లోగోతో కోడిగుడ్లు



ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

రాయికల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తుంది. ఇటీవల అంగన్‌వాడీ కోడిగుడ్లు పక్కదారి పట్టడంతో ప్రభుత్వం వాటికి చెక్ పెట్టేందుకు కోడిగుడ్లపై ప్రభుత్వ లోగోతో సరఫరా చేస్తున్నారు. ఇకపై ప్రతి కోడిగుడ్డుపై అంగన్‌వాడీ గుడ్డు అని రాసి ముద్రవేయనున్నారు. ఈ ప్రక్రియ జూన్ 1 నుంచి ప్రారంభం కానుంది.

నెలలో మూడు రంగులు

కోడిగుడ్ల పంపిణీలో అక్రమాలను నియంత్రించేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తోంది. నెలలో పది రోజులకోసారి కోడిగుడ్లపై ప్రత్యేక రంగుతో కూడిన ముద్ర వేస్తుంది. మొదటి విడతలో నీలి, రెండో విడతలో ఎరుపు, మూడో విడతలో ఆకుపచ్చ రంగుల్లో అంగన్‌వాడీ గుడ్డు మధ్యలో ముద్రించనున్నారు. ఈ బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీంతో కోడిగుడ్లు బాలింతలు, చిన్నారులకు చేరనున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట

ప్రభుత్వం ముద్రతో ఉన్న కోడిగుడ్లను కొనుగోలు చేసేందుకు దళారులు సైతం బయటపడే పరిస్థితి నెలకొంది. దుకాణాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ఒకవేళ విక్రయించినా ఎవరైనా కొనుగోలు చేసినా గుర్తించేందుకు సులభతరంగా ఉంటుంది. ఎవరు విక్రయించినా, కొనుగోలు చేసినా వారిపై అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ప్రాజెక్టులు	4
సెంటర్లు	1,065
6 ఏళ్లలోపు చిన్నారులు	5,634 మంది
7 నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులు	34,456
3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు	28,780
బాలింతలు	5,454
గర్భిణులు	7,654

నేటినుంచే అమలు



జిల్లాలో ఈనెల 1 నుంచి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్టాంపింగ్‌తో కూడిన కోడిగుడ్లు సరఫరా కానున్నాయి. ఈ కోడిగుడ్లు ఎక్కడైనా పక్కదారిపట్టినా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అంగన్‌వాడీలపై చర్యలు తీసుకుంటాం.

– నరేశ్, జిల్లా సంక్షేమాధికారి

పట్టణాభివృద్ధే ధ్యేయం

- మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్



మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్

జగిత్యాల: పట్టణాభివృద్ధే ప్రధాన ధ్యేయమని, అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.635.95 కోట్లు, పట్టణ ప్రగతి నుంచి రూ.70 లక్షలు పట్టణ అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రూ.15 లక్షలు నిధులు కేటాయించిట్లు పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా రూ.6.85 లక్షలు, తాగునీరు, క్లోరిన్ గ్యాస్, అలం, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు రూ.15 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.40 లక్షలు కేటాయించామన్నారు. మొత్తం 40 ఎజెండాలు ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కొన్ని వార్డుల్లో టీయూఎఫ్‌డీసీ కింద ప్రతివార్డుకు రూ.20 లక్షలు కేటాయించినప్పటికీ తమవార్డుకు రూ.5లక్షలు మాత్రమే పెట్టారని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ ఆరోపించారు. మున్సిపల్‌లో తీవ్ర అవినీతి జరుగుతుందని పేర్కొన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని పలువురు సభ్యులు కమిషనర్‌ను కోరారు.

'ఇన్‌చార్జుల పాలనలో అవినీతి పెరిగింది'

జగిత్యాలటౌన్: ఇన్‌చార్జుల పాలనతో పట్టణ బల్దియాలో అవినీతి పెరిగిందని బల్దియా కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య ఆరోపించారు. జగిత్యాల మున్సిపల్ సాధారణ సమావేశంలో 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ ఆసియా సుల్తానా పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఫ్లోర్ లీడర్ మాట్లాడుతూ.. బల్దియాలో చైర్మన్, కమిషనర్, డీఈలు అందరూ ఇన్‌చార్జీలేనని, దీంతో అన్ని విభాగాల్లో అవినీతి పెరిగినట్లు తెలిపారు. శానిటేషన్ విభాగంలో డీజిల్, రిపేర్ల పేరిట దోపిడీ పెరిగిందని, కాంగ్రెస్ సభ్యులున్న వార్డులకు నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. అభివృద్ధి పనులకు టెండర్లు లేకుండానే నచ్చిన వారికి కేటాయిస్తూ కమీషన్లు దండుకుంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సర్పంచ్ భర్తపై ఫిర్యాదు

సారంగాపూర్: విధులను అడ్డుకోవడంతోపాటు తనను గ్రామ పంచాయతీ కార్యాలయంలోని గదిలో నిర్బంధించాడని బీర్‌పూర్ పంచాయతీ కార్యదర్శి సతీశ్ సర్పంచ్ భర్తపై బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. సర్పంచ్ భర్త రమేశ్ బుధవారం కార్యాలయానికి వచ్చి ప్రభుత్వం కిచెన్ షెడ్డు బిల్లులు మంజూరు చేసిందని, తనకు బిల్లులు తీసుకునేందుకు చెక్కు జారీచేయాలని కోరాడు. దీనిపై కార్యదర్శి గతంలో వైకుంఠధామం పనులు నిర్వహణకు గ్రామ పంచాయతీ నుంచి రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారని, డబ్బులు చెల్లించాలని రమేశ్‌కు నోటీసులు కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. డబ్బులు చెల్లించాలని పలుసార్లు కోరినా రూ. 6.98 లక్షలు రావాల్సి ఉందని, వచ్చాక రూ. 2 లక్షలు చెల్లిస్తానని ఎంపీవో వెంకటకృష్ణరాజుకు తెలిపారని పేర్కొన్నాడు. వైకుంఠధామం కోసం అడ్వాన్స్‌గా తీసుకున్న రూ. 2 లక్షలు తిరిగి చెల్లిస్తే చెక్కు జారీచేస్తామని తెలిపామన్నారు. ఆగ్రహించిన రమేశ్ తనతోపాటు ఎంపీవోను అసభ్యపదజాలంతో దూషించారని, అనంతరం తనను గదిలో బంధించినట్లు పేర్కొన్నాడు. ఎంపీడీవో మల్లారెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి గది తలుపులు తీసినట్లు తెలిపాడు. దీంతో రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సతీశ్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.మోహన్ అన్నారు. బుధవారం నారాయణపురం, హరిదాస్ నగర్ గ్రామాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశాల కోసం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూపాయి ఖర్చులేకుండా ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, అందిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనాలు కరువు!

- జిల్లాలో 37 గ్రామాఖ్య సంఘాలకు మాత్రమే సొంత భవనాలు
- ఇబ్బందులు పడుతున్న స్వశక్తి సంఘాల సభ్యులు




సమావేశమైన స్వశక్తి మహిళలు (ఫైల్)

పెగడపల్లి: జిల్లాలో ఉన్న మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాఖ్య సంఘాలకు భవనాలు నిర్మించాలని సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కొనసాగుతోంది. స్వశక్తి సంఘాల ఏర్పాటు నుంచి ఇప్పటివరకు సొంత భవనాలు లేవు. ప్రతినెలా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఇక్కట్లు పడుతున్నామని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 565 గ్రామాఖ్య సంఘాలుండగా, 13,500 వరకు స్వయం సహాయక సంఘాలు, 1,74,694 మంది సభ్యులున్నారు. గ్రామస్థాయిలో కార్యాలయాలు లేక మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లు, సభ్యుల్లో చైతన్యం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించే గ్రామ సంఘాలకు సరైన వేదికలు అందుబాటులో లేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

భవనాలు నిర్మిస్తే సమస్యలు దూరం..

గ్రామీణ సంఘాల్లోని పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. సంఘాల కార్యకలాపాల నిర్వహణతో పాటు మహిళా సమాఖ్య, మహిళా పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణలు చేపట్టడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామాఖ్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చే మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులకు గ్రామాల్లో మౌలిక వసతులు కొరవడటంతో అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల నిర్వహణ కోసం మండల కేంద్రాల్లో ఇందిరా క్రాంతిపథం పేరిట సొంత భవనం ఏర్పాటు చేశారు. జిల్లాలో 37 గ్రామాఖ్య సంఘాలకు మాత్రమే సొంత భవనాలుండగా 528 సంఘాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 17 మండల సమాఖ్యలకు గాను 14 చోట్ల మాత్రమే మండల కార్యాలయాలున్నాయి. స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం గ్రామాల్లో సంఘ భవనాలు నిర్మిస్తే సంఘాల నిర్వహణలో తలెత్తే సమస్యలు దూరమయ్యే అవకాశం ఉంది.


ప్రతిపాదనలు పంపాం



స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణాల విషయం ప్రభుత్వ పరిధిలో ఉంది. జిల్లాలో పలు గ్రామాల్లో భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది.

– లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

'ప్రభుత్వ వైఫల్యమే'



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): ధాన్యం అన్‌లోడింగ్ విషయంలో రైస్‌మిల్లర్లను అదుపు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. కోతల పేరిట రైస్‌మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. అయినా, ఒక్క రైస్‌మిల్లర్‌పై చర్య తీసుకున్నారా? అని ప్రశ్నించారు. అధికారులు చిత్తశుద్ధితో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని కోరారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, మున్ను, రవీందర్‌రావు, జలపతిరెడ్డి, దివాకర్‌రెడ్డి, మ్యాకల రమేశ్, భూమయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ఎల్లారెడ్డిపేట: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు తిప్పడం లేదని జిల్లా సీపీఐ రైతు సంఘం కార్యదర్శి జంగం అంజయ్య, ఉపాధ్యక్షుడు గజ్జల ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. బస్తాకు 3 కిలోల తరుగు తీస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసి రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు అరుణ్, పాల్గొన్నారు.

'రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు'

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సామాజిక మాధ్యమాల్లో ఇతరుల మనోభావాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో ×తంగళ్లపల్లి మండల సమాచారం× అనే వాట్సాప్ గ్రూపులో ఇతరులను కించపరిచేలా పోస్టు చేసిన చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన జోగినిపల్లి రాజగోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న మొబైల్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన మెండె భవాని (38) బుధవారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మెండె భవానికి భర్త సత్యనారాయణ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా భవానికి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకి భవాని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వచ్చేసరికి ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. బావి వద్ద చెప్పులు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహాయంతో విద్యుత్ మోటార్లతో బావిలోని నీటిని తొలగించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. భవాని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ముగ్గురు పిల్లలు తల్లి మృతదేహాన్ని చూసి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఉరేసుకొని యువతి..



కావ్య మృతదేహం

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట గ్రామానికి చెందిన గుండు కావ్య (20) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన కావ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. పలు ఆసుపత్రులు తిరిగినా వ్యాధి నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



సత్తయ్య (ఫైల్)

ధర్మపురి : మండలంలోని దోనూర్ గ్రామానికి చెందిన కల్యాడపు సత్తయ్య (40) దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందగా బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సత్తయ్య కొంతకాలంగా దుబాయ్ వెళ్లి వస్తున్నాడు. మూడునెలల క్రితం ఇంటికి వచ్చి మళ్లీ దుబాయి వెళ్లాడు. అక్కడ కంపనీలో పని చేస్తుండగా గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా సత్తయ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి సహకారంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నా రు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ, సీనియర్ న్యాయవాది బెత్తపు లక్ష్మణ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్, చిరుత మల్లేశం తదితరులు పరామర్శించారు.

మిత్రుల ఔదార్యం

సాక్షి ఎఫెక్ట్..



ఆర్థికసాయం అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్, రమేశ్

ధర్మపురి : ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారిన రెండు పేద కుటుంబాలకు సామాజిక మిత్రులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన కలకోట మల్లేశ్ – భాగ్య వృద్ధ దంపతులకు సంతానం లేకపోవడంతో ఇద్దరు బంధువుల ఇంట్లో నివాముంటున్నారు. భాగ్య అనారోగ్యంతో బాధపడుతోంది. వచ్చే ఆసరా పింఛన్ డబ్బులు కూడా వైద్య ఖర్చులకు సరిపోవడం లేదు. ఇటీవల 'దేవుడా నన్నెందుకు బతికించావు' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. పట్టణానికి చెందిన లక్ష్మీ నృసింహ కాలనీకి చెందిన వేముల శంకర్ ఏడాది క్రితం వరకు టీస్టాల్ నిర్వహిస్తూ భార్య, ముగ్గురు పిల్లలను పోషిస్తున్నాడు. ఏడాది కింద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు దెబ్బతింది. ప్రస్తుతం మందుల కొనుగోలు, కుటుంబ పోషణ భారంగా మారింది. ఇరు కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, ఇతరులు వీరి బ్యాంకు ఖాతాకు రూ. 1.30 లక్షలు పంపించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ రవితేజ చేతుల మీదుగా రూ. 65 వేల చొప్పున నగదును ఇరువురికి అందజేశారు. జగిత్యాలకు చెందిన పోప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వృద్ధ దంపతులకు సరిపడా కిరాణ సామగ్రిని ప్రతినెలా పంపిణీ చేస్తామన్నారు. అనంతరం నిత్యావసర వస్తువులు అందజేశారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు?

జగిత్యాలక్రైం: పెగడపల్లి పోలీసుల అదుపులో ఇద్దరు గంజాయి విక్రేతలు ఉన్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సదరు యువకుడితో జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు కూడా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. పోలీసులు బుధవారం సాయంత్రం పొరండ్ల గ్రామానికి చెందిన యువకుడిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా ఇద్దరితో పాటు మరో నలుగురు కొంతకాలంగా ఒరిస్సాకు చెందిన ఓ వ్యక్తి పరిచయంతో అక్కడి నుంచి గంజాయి కొనుగోలు చేసి జిల్లాలో కొంతమందికి విక్రయిస్తున్నట్లు సమాచారం. పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు



ధ్వంసమైన మొబైల్, ట్యాబ్

జగిత్యాల క్రైం/మల్లాపూర్: మద్యం మత్తులో రోడ్డుపై హంగామా సృష్టిస్తూ హెడ్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్పించిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మల్లాపూర్ మండలం పాత దామ్‌రాజ్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో రోడ్డుపై హంగామా చేస్తున్నారని డయల్ 100 ఫోన్ రావడంతో హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు పెట్రోలింగ్ వాహనంలో అక్కడికి వెళ్లారు. గ్రామ పంచాయతీ దగ్గరలో రోడ్డుపై కొంతమంది ఉండగా ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లాలని హెడ్‌కానిస్టేబుల్ సూచించారు. దీంతో దురుసుగా ప్రవరించడంతో పాటు హెడ్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించారు. పెట్రో కార్, బ్లూ కోర్ట్ ట్యాబ్‌లను ధ్వంసం చేశారు. దీంతో కొమ్ముల చిన్నారెడ్డి, రెండ్ల రాజిరెడ్డి, ఇప్ప గణేశ్, బెజ్జారపు నరేశ్, గజ్జి నరేశ్, గజ్జి రమేశ్, పొలాస సురేశ్, ఎనుగందుల రమేశ్, కలికోట గంగాధర్‌పై హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై లక్ష్మయ్య 9 మందిపై కేసు నమోదు చేశారు. బుధవారం సీఐ లక్ష్మీనారాయణ గ్రామంలో విచారణ చేపట్టారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్ రెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఓ వైపు వానాకాలం ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేయడం లేదన్నారు. మంత్రి కేటీఆర్ రైతులు ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. దశాబ్ది వేడుకల పేరిట రైతులు సంబరాలు జరుపుకోవాలని పిలుపునివ్వడం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య, షేక్ గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, చిన్ని బాబు, కొత్తపల్లి దేవయ్య, మానక నాగరాజు యాదవ్, బానోత్ రాజునాయక్, చెరుకు ఎల్లయ్య, బీపేట రాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల ప్రధాన రహదారిపై లారీ, టాటాఏస్ ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థాని కులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా బల్వంతపూర్‌కు చెందిన కుటుంబ సభ్యులు టాటాఏస్‌లో కొమురవెల్లి మల్లన్న దర్శనానికి బయలుదేరారు. జిల్లెల్ల అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రధాన రహదారి వద్దకు చేరుకోగానే సిద్దిపేట నుంచి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 11 మందికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు, విద్యార్థినులకు అండగా షీటీం

సిరిసిల్ల క్రైమ్: జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులకు షీ టీం అండగా ఉంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం ఎస్పీ మాట్లాడుతూ షీ టీం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. గత నెలలో 21 ఫిర్యాదులు అందగా పోకిరీలకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని.. ఒక కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, హాట్ స్పాట్‌లపై ప్రత్యేక నిఘా, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆపద సమయంలో 8712656425, డయల్ 100 సమాచారం అందించాలన్నారు.